www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 30 నవంబర్ 2024

5

పశ్చిమ గోదావరి

ఇన్‌ఛార్జి సిపిఒగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా ఇన్‌ఛార్జి ముఖ్య ప్రణాళిక అధికారిగా కంటిపూడి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా పని చేస్తున్న ఎం.మోహన్‌రావును జాయింట్ డైరెక్టర్‌గా అమరావతిలోని సచివాలయంలో ప్లానింగ్ శాఖకు బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మోహన్‌రావు స్థానంలో కంటిపూడి శ్రీనివాసరావును జిల్లా ఇన్‌ఛార్జి ముఖ్య ప్రణాళిక అధికారిగా నియమించారు.

పర్యాటకం పరుగులు తీసేనా..!

రెండు జిల్లాల్లో పర్యాటక రంగం అభివృద్ధికి మెండుగా అవకాశాలు

మాటల్లో తప్ప.. చేతల్లో ముందుకు సాగని ప్రభుత్వాలు

కొల్లేరు, గుంటుపల్లి బౌద్ధ గుహల పరిస్థితి ఏంటి?

పేరుపాలెం బీచ్ అభివృద్ధికి చర్యలు అంతంతమాత్రమే

గోదావరి, సముద్ర తీరంలో రిస్టార్ట్స్ అభివృద్ధిలోనూ నిర్లక్ష్యమే

నరసాపురంలో ఆహ్లాదకరమైన గోదావరి పరివాహక ప్రాంతం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా చేతల్లో చూపించాలంటూ జిల్లా ప్రజానీకం కోరుకుంటున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పర్యాటక రంగం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక రంగం అభివృద్ధి గురించి పదేపదే చెబుతున్న పరిస్థితి ఉంది. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పర్యాటక రంగ అభివృద్ధికి అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు మాట్లాడుతున్నారు. దీంతో జిల్లాలోని పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై జనాల్లో చర్చ కొనసాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నడుమ ఉన్న కొల్లేరు సరస్సు 77 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద తాగునీటి సరస్సు కొల్లేరు. ఇక్కడికి ఏటా వందల సంఖ్యలో విదేశీ పక్షులు వలస వస్తుంటాయి. ఆటపాకలో ప్రత్యేకంగా పక్షుల కేంద్రం, గుడివాకలంకలో రిస్టార్ట్ ఉన్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. పర్యాటక ప్రాంతంగా కొల్లేరుకు మంచి గుర్తింపు ఉంది. బోట్ షికారు వంటివి ఏర్పాటు చేసి, రిస్టార్ట్స్ నిర్మించి సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకంగా కొల్లేరు ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఇక్కడి ప్రజలకు సైతం పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కొల్లేరు పర్యాటక అభివృద్ధిపై సమావేశాలు నిర్వహించడం తప్ప ఒక్క అడుగు ముందుకు పడిన పరిస్థితి లేకుండా పోయింది. కామవరపుకోట గుంటుపల్లి బౌద్ధగుహలకు గొప్ప చరిత్ర ఉంది. అక్కడ వసతులు కల్పిస్తే పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉన్నప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోని పరిస్థితి కొనసాగుతోంది. పోలవరం నుంచి కుక్కునూరు వరకూ గోదావరి తీర ప్రాంతాల్లో రిస్టార్ట్స్ ఏర్పాటు చేస్తే పెద్దఎత్తున పర్యాటకులు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. కొల్లేరు పెద్దింట్ల గుడికి అనేక జిల్లా నుంచి పెద్దఎత్తున జనం వస్తుంటారు. అక్కడ సరైన వసతులు లేని పరిస్థితి నెలకొంది. సరైన రవాణా సదుపాయం సైతం లేకుండా పోయింది. ఇలాంటి ప్రాంతాలను గుర్తించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం పెరగడంతో పాటు, ఎంతో మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంది.

సముద్ర, గోదావరి తీరాల్లో పర్యాటక అభివృద్ధి ఏదీ?

విభజిత పశ్చిమగోదావరి జిల్లాలో సముద్ర, గోదావరి తీరం కిలోమీటర్ల మేర ఉంది. మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌కి ఏటా కార్తీక మాసంతోపాటు, ఇతర సెలవు దినాల్లోనూ పెద్దఎత్తున పర్యాటకులు వెళ్తుంటారు. ఈ ప్రాంతంలో ఇప్పటికీ సరైన సదుపాయాలు లేకుండా పోయాయి. పెద్దఎత్తున రిస్టార్స్ నిర్మించి పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉన్నా ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. దొంగరావిపాలెం రిసార్ట్స్ వంటివి కొన్ని మాత్రమే ఉన్నాయి. తీరప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి. పెద్దమల్లంలో రిసార్ట్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పూర్తయినా ఇప్పటికీ ముందుకు సాగని పరిస్థితి. మొళ్లపర్రులోనూ అదే పరిస్థితి నెలకొంది. ఇవి కాకుండా ఏజెన్సీ ప్రాంతం బుట్టాయగూడెం మండలంలోని దొరమామిడి వద్ద గుబ్బాల మంగమ్మ గుడి ప్రాంతం, పశ్చిమలోని భీమవరం, పాలకొల్లులో ఉన్న పంచరామ క్షేత్రాలను పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది. ప్రభుత్వాలు మాత్రం మాటలకే.. తప్ప చేతల్లో మాత్రం ముందుకు సాగడం లేదు. కూటమి ప్రభుత్వమైనా జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి పరుగులు పెట్టించాలని అంతా కోరుతున్నారు.

ఆచంట మార్కెట్ యార్డ్‌లో ధాన్యం పోగు చేసుకుంటున్న రైతులు

చిరుజల్లులు.. రైతుల్లో గుబులు

ప్రజాశక్తి - ఆచంట

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో శుక్రవారం సాయంత్రం చిరుజల్లులు పడ్డాయి. దీంతో రైతుల్లో గుబులు నెలకొంది. మండలంలో ఇప్పటికే 40 శాతానికిపైగా వరి కోతలు పూర్తయ్యాయి. ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడంలో రైతులు తలమునకలై ఉన్నారు. ఈ తరుణంలో వాతావరణం ఒక్కసారిగా మారి ఈదురుగాలులతో చిరుజల్లులు పడ్డాయి. ధాన్యాన్ని బరకాలతో కప్పి కాపాడుకోవడానికి ప్రయత్నించారు. వర్షం కొద్దిసేపు కురిసి ఆగడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈదురు గాలులకు కొన్ని ప్రాంతాల్లో వరి పంట నేలన్నంటింది. మరో వారం రోజులపాటు వాతావరణం కరుణిస్తే తప్ప గట్టెక్కలేమని రైతులు చెబుతున్నారు.

పాలకొల్లు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా శుక్రవారం సాయంత్రం వాతావరణం పూర్తిగా మారింది. చిరు జల్లులు పడ్డాయి. దీంతో రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. ధాన్యపు రాశులపై బరకాలు కప్పుకోవడం, వరి పనలను గట్టుపైకి చేర్చడం వంటి పనుల్లో మునిగి తేలారు.

ఆకివీడు: వాతావరణ మార్పులతో వరి రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా సార్వా సీజన్ ప్రారంభంలోనే భారీ వర్షాలు, వరదలతో వరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో సగానికిపైగా పంట చేలు పోగా సుమారు 1800 ఎకరాల్లో వరి పంట నిలిచింది. ప్రస్తుతం వాతావరణ మార్పులతో ఆ పంట కూడా దక్కకుండా పోయే దుస్థితి ఏర్పడిందని రైతులు లబోదిబోమంటున్నారు. ఉన్న పంటను రక్షించుకోవడానికి అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

ఆకివీడులో హడావుడిగా నూరుస్తున్న వరి కుప్ప

ఆరబెట్టని ధాన్యానికి ధర రూ.1550 అందించాలి

ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు ధాన్యం కోసిన వెంటనే అమ్మేస్తున్నారని, దీన్ని ఆసరా చేసుకొని దళారులు ధాన్యం ధర తగ్గించి కొనుగోలు చేసి దోచుకుంటున్నారని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరంలో ధాన్యం రాశుల వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడారు. గత వారం రోజులుగా వాతావరణం బాగోలేకపోవడంతో రైతులు ధాన్యం కోసిన వెంటనే అమ్మేస్తున్నారన్నారు. దీంతో దళారులు, మిల్లర్లు బస్తాకు కేవలం రూ.1400 నుండి రూ.1450 వరకే రైతులకు చెల్లిస్తున్నారని తెలిపారు. దీంతో వంద బస్తాలు పండించిన రైతు రూ.15 వేలకుపైగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి కోసిన వెంటనే పట్టే ధాన్యానికి కనీసం రూ.1550కు తగ్గకుండా ధర అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తేమశాతం 17 పాయింట్లు నుండి 24 వరకు ఉన్నా రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అధికారులు ప్రచారం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోనెసంచుల కొరత రాకుండా చూడాలని, రైతుసేవా కేంద్రాల ద్వారా వాహనాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ధాన్యం తరలించాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న రామాంజనేయులు, రైతులు

అవినీతిపరుల పేర్లు బహిరంగ పరచాలి

సిపిఎం మండల కన్వీనర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అదానీ దగ్గర తీసుకున్న ముడుపులు, అవినీతి పేర్లు బహిరంగపరచాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం రూరల్ తోకతిప్ప గ్రామంలో గురువారం మధ్యాహ్నం అదానీ దగ్గర తీసుకున్న అవినీతిపరుల పేర్లు బహిరంగపరచాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ అదానీ దగ్గర తీసుకున్న అవినీతిపరుల పేర్లు బహిరంగపరచాలన్నారు. తమ రాష్ట్రంలోనే సౌర విద్యుత్ ఒప్పందం ద్వారా రూ.1,750 కోట్ల అవినీతి జరిగిందని అమెరికాలోని న్యూయార్క్‌లో కోర్టు బట్టబయలు చేసిందన్నారు. అదానీ అవినీతిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ జరిపి అవినీతిపరుల పేర్లు బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమాని నాగేశ్వరరావు, తిరుమాణి సూర్యనారాయణ, పొన్నాల నరసింహస్వామి, కొల్లాటి సుబ్బారావు పాల్గొన్నారు.

భారాలు ఉపసంహరించకుంటే.. మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం

వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం హెచ్చరిక

అదానీ అవినీతికర ఒప్పందాలను రద్దు చేయాలి

వైసిపి విధానాలను కూటమి ప్రభుత్వం కొనసాగించడం దారుణం

ప్రజాశక్తి - భీమవరం

వివిధ రకాల ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలను మోపి ప్రజానీకాన్ని అన్ని విధాలా ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టడం అన్యాయమని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం హెచ్చరించింది. అదానీ అవినీతికర ఒప్పందాలను రద్దు చేసి అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో స్మార్ట్ మీటర్లు వస్తున్నాయని, వీటి బిగింపును ఆపకపోతే పర్యవసానం వేరేలా ఉంటుందని హెచ్చరించింది. గత వైసిపి ప్రభుత్వ విధానాలను టిడిపి కూటమి ప్రభుత్వం కొనసాగించడం దారుణమని విమర్శించింది. స్థానిక మెంటేవారి తోటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో 'విద్యుత్ ఛార్జీల భారాలు-అవినీతికర ఒప్పందాలు'పై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్‌బ్లాక్, ఎంసిపిఐ(యు), న్యూడెమోక్రసీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపు, విద్యుత్ ఒప్పందాలు, స్మార్ట్ మీటర్ల బిగింపు, ప్రజలపై విద్యుత్ భారాలు మోపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. లక్షల కోట్ల రూపాయలు కంపెనీలకు రాయితీలిచ్చి సామాన్య ప్రజానీకంపై మోయలేని విధంగా విద్యుత్ భారాలు మోపడం సరైనది కాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. అదానీ కంపెనీలతో ఒప్పందాలు రద్దు చేయాలని, ట్రూఅప్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలని, స్మార్ట్‌మీటర్ల బిగింపు ఆపాలని, వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని డిమాండ్ చేశారు. వీటిని కొనసాగిస్తే వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజానీకాన్ని సమీకరించి మరో విద్యుత్ ఉద్యమ్యం పెద్దఎత్తున చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు, త్రిమూర్తులు, కలిపిండి సత్యనారాయణ, బంగారు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

వాగ్దానాలు మరిచి భారాలు మోపడం సిగ్గుచేటు

బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి

టిడిపి కూటమి పాలన గత వైసిపి ప్రభుత్వ పాలనకు భిన్నంగా ఏమీ లేదు. వైసిపి విధానాలనే కూటమి కొనసాగిస్తోంది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి పరోక్షంగా అనేక రకాల ఛార్జీల భారం మోపడం అన్యాయం. ఎరువులు, పురుగు మందులు, నిత్యావసరాల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్, ఔషధాల ధరలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. ఎన్నికల ముందు టిడిపి కూటమి ఇచ్చిన వాగ్దానాలు మరిచి భారాలను మోపడం సిగ్గుచేటు. కారుచౌకగా అందించాల్సిన విద్యుత్‌ను అదానీ వంటి బడా కంపెనీల వద్ద లంచాలు తీసుకుని అధిక ధరకు కొనుగోలు చేయడం దారుణం. స్మార్ట్ మీటర్లు పెట్టబోమని చెబుతూనే ప్రభుత్వ కార్యాలయాలకు, పరిశ్రమలకు బిగిస్తున్నారు. తర్వాత ఇళ్లకు బిగించేందుకు రంగం సిద్ధం చేశారు. ఒక్కో స్మార్ట్ మీటర్ ధర రూ.25 వేల వరకు ఉంటుంది. ప్రతి నెలా సెల్‌ఫోన్ రీఛార్జి మాదిరిగానే విద్యుత్ రీఛార్జి చేసుకోవడంతోపాటు స్మార్ట్ మీటర్‌కు సంబంధించిన సొమ్మును కూడా ప్రతి నెలా కోత వేస్తూ ఉంటారు. స్థిరమైన ధర లేకుండా విద్యుత్ వినియోగాన్ని బట్టి ధర కూడా పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమెరికాలో అదానీ కుంభకోణం బయటపడింది. దీనిపై వైసిపిగాని, మోడీ, చంద్రబాబు, జనసేన నేతలు కనీసం మాట్లాడకపోవడం అంటే అవినీతిని సమర్థించినట్లే. అదానీ కుంభకోణంపై కేంద్రం విచారణ జరిపించాలి. అదానీనీ అరెస్టు చేయాలి. విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి.

సూపర్ ఎక్స్‌గా మిగిలిపోతారు

ఎం.సీతారాం ప్రసాద్, సిపిఐ జిల్లా నాయకులు

గత వైసిపి ప్రభుత్వం నవరత్నాల పేరుతో ముందుకొచ్చింది. సూపర్ సిక్స్ పథకాల పేరుతో కూటమి అధికారం చేపట్టింది. వాటిని అమలు చేయకపోతే సూపర్ ఎక్స్‌గా భవిష్యత్తులో మిగిలిపోవడం ఖాయం. విద్యుత్ ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల బిగింపు వంటి వాటిని తక్షణం రద్దు చేయాలి. వీటికి వ్యతిరేకంగా ఉద్యమాలు సాగించాల్సిన అవసరం ఉంది.

ఉద్యమం తీవ్రతరం చేయాలి

లంక కృష్ణమూర్తి, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి

ఎనిమిది రకాల విద్యుత్ ఛార్జీలు పెంచారు. ఇవి ఎవరికీ తెలియవు. బిల్లు ఇచ్చే వాడికి, తయారు చేసే వాడికి, చివరకు కట్టేవాడికీ తెలియని పరిస్థితి ఉంది. విద్యుత్ ఛార్జీల పెంపుపై ఉద్యమం తీవ్రతరం చేయాలి. ఆక్వా రైతులకు వైసిపి ప్రభుత్వం నిబంధనల పేరుతో పరిమితం చేసి రూ.1.50 పైసలకు యూనిట్ విద్యుత్ అందిస్తే కూటమి ప్రభుత్వం దీనిపై నోరు మెదపట్లేదు. ఎన్నడూ లేనంతగా ఉల్లి కిలో రూ.70, వెల్లుల్లి కిలో రూ.500 నుంచి రూ.800, వంట నూనెలు రూ.180 నుంచి రూ.200 వరకు పెరిగాయి. వీటి ధరలు తగ్గించాల్సిందిపోయి మరింత విద్యుత్ భారం మోపడం సరైంది కాదు.

ఉల్లాసం.. ఉత్సాహం..!

ఆటపాటలతో సేదదీరిన అధికారులు

ఘనంగా కలెక్టరేట్ ఉద్యోగుల వన సమారాధన

ప్రజాశక్తి - భీమవరం

వారంతా జిల్లా అధికారులు. ఉద్యోగులు.. వివిధ శాఖల్లో వివిధ స్థాయిల్లో బాధ్యతల్లో ఉన్నవారు.. అయితే ఆ బాధ్యతలు, హోదాలు, వయస్సులో తారతమ్యాలు మరిచి చిన్న పిల్లల వలె ఆట పాటల్లో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. జిల్లా కలెక్టరేట్ సమీపంలోని ప్రకృతి ఆశ్రమం ఎదురుగా ఉన్న మామిడితోట దీనికి వేదికైంది. జిల్లా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వన సమారాధన సిబ్బందిని మంత్రముగ్దులను చేసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. కలెక్టర్, జెసి రెండు జట్లుగా ఏర్పడి స్వయంగా వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ ఆడి అందరిలో ఉత్సాహం నింపారు. కలెక్టర్ మహిళా అధికారులతో కలిసి కబడ్డీ ఆడారు. డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు కార్తీక మాసం విశిష్టతపై వివరించగా, ఆకివీడు తహశీల్దార్ ఫోక్ సాంగ్, ఆకివీడు మున్సిపల్ కమిషనర్ 'టీ'పై పాడిన పేరడీ సాంగ్, మున్సిపల్ పాఠశాల టీచర్ పాడిన 'అమ్మ' పాట, కలెక్టరేట్ సిబ్బంది పాడిన పాటలు అందరినీ ఉర్రూతలూగించాయి. భోజన ఏర్పాట్లు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. విజేత టీమ్‌లకు, రన్నర్స్ టీమ్‌లకు కలెక్టర్, జెసి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ నిరంతరం వివిధ పనుల ఒత్తిడిలో సతమతమయ్యే అధికారులు, సిబ్బందికి కొంత ఆటవిడుపు కల్పించాలనే వన సమారాధన ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారులు, సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో విధులను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి వి.భీమారావు, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒలు దాసి రాజు, కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఖతీభ్ కౌసర్ భానో, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ తహశీల్దార్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్లు, సిబ్బంది, వ్యాఖ్యాతలు బాజింకి గంగా మహేష్‌నాయుడు, బడుగు చంద్రశేఖర్, సంగడి రాజు, ఆటల పోటీల రిఫరీలు కె.విజయశ్రీ, జి.నర్మద, ఇందిరావాణి, ఎమ్‌డి.కుద్దూస్, కె.చిట్టిబాబు, సిహెచ్.పరశురాంనాయుడు పాల్గొన్నారు.

కబడ్డీ ఆడుతున్న కలెక్టర్, అధికారులు



జెసి ఛలోక్తులతో ఆనంద డోలికల్లో కలెక్టర్, అధికారులు

కంప్యూటరీకరణ పేరుతో సహకార సంఘాలపై ఒత్తిడి

ఉద్యోగులపై పని భారం మోపడం సరైంది కాదు

ఎపి కోఆపరేటివ్ సొసైటీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు అజయ్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీపై కంప్యూటరీకరణ పేరుతో విపరీతంగా మానసిక ఒత్తిడి తెస్తున్నారని ఎపి కోఆపరేటివ్ సొసైటీ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్ కుమార్ విమర్శించారు. ఎటువంటి శిక్షణ అందించకుండా ఉద్యోగులపై పని భారం మోపడం సరైంది కాదన్నారు. భీమవరం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ వద్ద సహకార సంఘం జిల్లా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకార వ్యవస్థను ప్రయివేటీకరణ చేయడం కోసం రాజ్యాంగంలో రాష్ట్ర హక్కుగా ఉన్న సహకార వ్యవస్థను కేంద్రం ఖాతాలోకి తీసుకు వెళ్లిందని విమర్శించారు. కంప్యూటర్ అవసరమని కానీ, ముందస్తుగా ఎటువంటి శిక్షణా ఇవ్వకుండా, దానికి కావలసిన సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేయకుండా ఉద్యోగులపై భారం మోపడం సరైంది కాదని విమర్శించారు. సహకార సంఘ ఉద్యోగులకు గత ఎనిమిదేళ్ల నుంచి వేతన సవరణ జరగలేదన్నారు. 36 జిఒ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి సహకార సంఘ ఉద్యోగులు విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారన్నారు. సొసైటీలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, దానికి కావలసిన సిబ్బంది నైపుణ్యం కలిగించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. నామమాత్రపు శిక్షణ ఇచ్చి ఉద్యోగులపై ఒత్తిడి చేయడం సరైంది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నుంచి రావలసిన వివిధ బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సహకార సంఘం నేతలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అజయ్‌కుమార్

కేంద్రం ఆర్థిక విధానాలు ప్రమాదకరం

సిపిఎం మండల మహాసభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్

ప్రజాశక్తి - వీరవాసరం

కేంద్రంలోని బిజెపి ఆర్థిక విధానాలు దేశానికే ప్రమాదకరమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. సిపిఎం వీరవాసరం మండల మహాసభ పెర్కిపాలెం గ్రామంలో నేతల ఆనంద రావునగర్‌లో ఆ పార్టీ మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ మోడీ పాలనలో బిజెపి విధానాలతో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. మోడీ ఆర్థిక విధానాలు కార్పొరేట్లకు దోచిపెట్టడం తప్ప సామాన్యులకు ఎటువంటి ఉపయోగమూ లేదన్నారు. మన రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపిని టిడిపి కూటమి, వైసిపి బలపర్చడం అత్యంత బాధాకరమన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఉపాధి, ఉద్యోగావకాశాలు సన్నగిల్లుతున్నాయన్నారు. సిపిఎం జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ స్థానిక సమస్యలపై పోరాటాల ద్వారా ప్రజలతో మమేకమవ్వాలన్నారు. కార్యకలాపాల నివేదికను పోతుల మృత్యుంజయ ప్రవేశపెట్టారు. దీనిపై ప్రతినిధులు చర్చించి ఆమోదం తెలిపారు. మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి, బొర్రా ఆలమహారాజు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న కేతా గోపాలన్

రోడ్డు పున: నిర్మించాలని వినతి

నరసాపురం : నరసాపురం టు వయా మత్స్యపురి భీమవరం ఆర్‌అండ్‌బి రోడ్డు, కొత్త నవరసాపురం, పాత నవరసాపురం ఆర్‌అండ్‌బి రోడ్డు పున: నిర్మంపచేయాలని, మరమ్మతులకు గురైన రోడ్లను బాగు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో నరసాపురం ఆర్‌అండ్‌బి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎఇ ప్రసన్నకుమార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ఇరువురు నాయకులు మాట్లాడుతూ మండలంలో నరసాపురం టు భీమవరం వయా మత్స్యపురి ఆర్‌అండ్‌బి రోడ్డు సరిపల్లి, లిఖితపూడి, కొప్పర్రు గ్రామాలలో రోడ్డు మొత్తం శిథిలా వ్యవస్థకు చేరుకుందన్నారు. గోతులు, గుంతలు ఏర్పడి ప్రజలు ప్రయాణం చేయడానికి చాలా అసౌకర్యంగా ఉంటుందన్నారు. తక్షణం ఈ రోడ్డును యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యురాలు పొగాకు పూర్ణ, కె.నరేష్, హరి పాల్గొన్నారు.

ఎఇకి వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

శానిటేషన్‌పై ధ్వజమెత్తిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - నరసాపురం

శానిటేషన్ నిర్వహణపై శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికార, స్వపక్ష సభ్యులు ధ్వజమెత్తారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్లు కొత్తపల్లి నాని, కామన నాగినీలు మాట్లాడుతూ పట్టణంలోని గోదావరి తీరాన స్మశానవాటిక వద్ద స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మలబద్ద కేంద్రం గడువు ఈ ఏడాదితో ముగుస్తుందని, దీన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో లక్షలు విలువ చేసే పనిముట్లు వృథా అవుతాయన్నారు. ఇటు శానిటేషన్‌పై జనసేన సభ్యులు బొమ్మిడి కృష్ణకుమార్, తోట అరుణ, వైసిపి సభ్యులు పతివాడ పద్మలు మాట్లాడుతూ చెత్తా, చెదారం డ్రెయినేజీల్లో సిల్ట్ సక్రమంగా తీయకపోవడం వల్ల పట్టణంలో దోమలు విజృంభిస్తున్నాయన్నారు. దీంతో పట్టణ ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. కౌన్సిలర్ సభ్యులు వైజిఎస్ మాట్లాడుతూ శానిటేషన్ లోపాల్లో, రెస్టారెంట్లలో ఫుడ్ తనిఖీలు చేయడంతో పాటు హోటల్స్ పరిసరాల్లో శానిటేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. పందులు వస్తున్నందున అన్ని వీధుల్లో వీధిలైట్లు వెలిగేలా చూడాలని కౌన్సిలర్లు ఆకుల దిలీప్, అడిదల శ్యామల కోరారు. పట్టణంలో పందుల బెడద పెరిగిందని పతివాడ పద్మ, మల్లాడి శేషవేణి, పశువుల గురించి సభ్యులు కామన నాగిని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయ సిబ్బంది ఎక్కడ పని చేస్తున్నారో కౌన్సిలర్లకు తెలియని పరిస్థితి నెలకొందని కేసరి గంగరాజు, కామన నాగిని, కొత్తపల్లి నాని ప్రస్తావించారు. పలువురు కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ అంజయ్య సమాధానం తెలిపారు.

పిహెచ్‌సి ప్రత్యేక అధికారిగా తహశీల్దార్

ఆకివీడు : మండలంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ప్రత్యేక పర్యవేక్షణాధికారిగా తహశీల్దార్ సందారి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈమేరకు కలెక్టర్ నుంచి ఆయనకు ఆదేశాలందాయి. పెదకాపవరంలో ఉన్న మండల పిహెచ్‌సిని తరచూ పర్యవేక్షించవలసి ఉంటుంది. సిబ్బంది హాజరు, బయోమెట్రిక్ నిర్వహణ, ఓపి నిర్వహణ, అవసరమైన స్టాక్ నిర్వహణ, పరిశుభ్రత వంటి అంశాలతో పాటు మరిన్ని అంశాలను ఆయన పరివేక్షిస్తారు.

సర్వే రాయిపై పేర్ల తొలగింపు పరిశీలన

పెంటపాడు : మండలంలోని యానాలపల్లి, ఎన్ఎ పురం, బొడపాడులో గతంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జగనన్న భూ రక్ష పథకం 2020 అని సర్వే రాయిపై ఉన్న పేరు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ ఆదేశించిన ప్రకారం పనులు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని జిల్లా భూ సర్వే అధికారి జాషువా శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ల్యాండ్ సర్వే ఆఫీసర్ రౌతు రామకృష్ణ, గ్రామ సర్వేయర్లు ఐవి.సతీష్, ఫణి కుమార్, విఆర్ఒ బి.వెన్న హాజరయ్యారు.

మార్టేరులో బాస్కెట్‌బాల్ పోలీస్ టీమ్‌కు శిక్షణ

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు శ్రీవేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో బాస్కెట్‌బాల్ పోలీస్ టీమ్ శుక్రవారం శిక్షణ తీసుకుంది. గతంలో బాస్కెట్‌బాల్ ఆటలో ఎంతోమంది క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి పంపిన ఘనత ఈ క్రీడా మైదానానికి దక్కింది. కాగా, మార్టేరులోని అంతర్జాతీయ కిషోర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్, అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ ప్లేయర్ సత్తి సుబ్బన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వచ్చే సంవత్సరం జనవరిలో జాతీయ స్థాయిలో ఉత్తరప్రదేశ్‌లో జరిగే బాస్కెట్‌బాల్ పోటీలకు గత నాలుగు నెలల నుంచి ట్రైనింగ్ కావడం జరుగుతుందని సుబ్బన్ రెడ్డి తెలిపారు. ఎంతోమంది క్రీడాకారులను ఇక్కడ నుంచే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడారని, గ్రౌండ్ ప్రాక్టీస్ చేద్దామని వచ్చారని తెలిపారు. డ్రిల్ మాస్టర్ కృష్ణారెడ్డి, ఎపి పోలీస్ టీంను ఈ సందర్భంగా అభినందించారు. క్రీడాకారులు గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి పాల్గొన్నారు.

నిస్సి ఫ్లోరాకు సన్మానం

ఉండి : నిస్సి ఫ్లోరా అహ్మదాబాద్ రాష్ట్ర హార్టికల్చర్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్‌గా ఎంపిక కావడం అరుదైన గౌరవమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఉండి పెదపేటలోని నిస్సి ఫ్లోరా ఇంటి వద్ద మాల మహానాడు తరఫున ఆమెకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నేటి పుష్పరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 19 వేల మంది పరీక్షలకు హాజరుకాగా 19 మంది మాత్రమే ఎంపికయ్యారని, అందులో ఉండి గ్రామానికి చెందిన గోడి నిస్సి ఫ్లోరా ఉండడం అభినందించ దగ్గ విషయం అని వారు కొనియాడారు. అనంతరం నిస్సి ఫ్లోరా మాట్లాడుతూ తన తండ్రి విశ్రాంత ఉపాధ్యాయులు గోడి ఏసురత్నం, అమ్మమ్మ బిట్టూరి ఫ్లోరెన్స్, భర్త సంజయ్ తన కుటుంబ సభ్యుల తాను ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతగానో ప్రోత్సాహం, సహకారం అందించారని అన్నారు. సన్మానించిన వారిలో మేడిది పాల ప్రసాదం జగన్నాథ్, బిళ్ల రాజ్ కుమార్, పిల్లి చంటిబాబు, దొల్ల నాని, నిస్సి ఫ్లోరా కుటుంబ సభ్యులు ఉన్నారు.

భీమలాపురంలో సహపంక్తి భోజనం

ఆచంట : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భీమలాపురం గ్రామంలోని జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆడుతూ, పాడుతూ కేరింతలు కొట్టారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. సర్పంచ్ గుబ్బల మాధవరావు, ప్రధానోపాధ్యాయులు ఎన్‌కెవి.మూర్తి, విద్యా కమిటీ ఛైర్మన్ కౌరు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు హోటళ్ల తనిఖీలు

నరసాపురం : నరసాపురం పట్టణంలోని పంజా సెంటర్‌లోని పలు హోటళ్లను నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవని ఆయా హోటళ్ల నిర్వాహకులను హెచ్చరించారు. పరిశుభ్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా జరిమానా విధించి హోటళ్లను సీజ్ చేస్తామన్నారు. ఆయనతో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ఆర్‌కె.నానాజీ, సానిటరి ఇన్స్‌పెక్టర్ వేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కొత్త కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆచంట : కోడూరు కొత్త కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం బృందంతో పోడూరు కొత్త కాలనీలో రహదారులు, డ్రెయినేజీ, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పిల్లి ప్రసాద్, బూరా బత్తుల వెంకటేశ్వరరావు, ఆ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పికే విక్రయించాలి

తాడేపల్లిగూడెం : జంగారెడ్డిగూడెం ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా తూనికలు కొలతలు ఎడిఎ రమేష్ శుక్రవారం తాడేపల్లిగూడెంలోని పెద్ద తాడేపల్లి, మున్సిపాలిటీ పరిధిలో గల ఎరువులు, పురుగుమందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్ ప్రసాద్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఎంఆర్‌పి ధరలకు మించి ఎరువులు అమ్మరాదని సూచించారు. ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని పురుగుమందుల అమ్మకాలను నిలిపివేశారు. సుమారు రూ.86,534 విలువ గల పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. డీలర్లందరూ స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా మెయింటెన్ చేయాలని, స్టాక్ బోర్డులపై స్టాక్ వివరాలు నమోదు చేయాలని ఆయన సూచించారు.

తెలుగు మీడియంలో హాల్ టికెట్లు

తల్లిదండ్రుల ఆందోళన

మొగల్తూరు : ఇంగ్లిష్ మీడియంలో సన్నద్ధమైన విద్యార్థులకు తెలుగులో హాల్ టికెట్ రావడంతో వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. దీనికి సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముత్యాలపల్లిలోని ఐండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జాతీయ ప్రతిభ ఉపకార వేతనం(ఎన్ఎమ్ఎమ్ఎస్ స్కాలర్ షిప్) పరీక్షకు హాజరు కాబోతున్న విద్యార్థులకు ఇంగ్లిష్‌లో రావాల్సిన హాల్ టికెట్లు తెలుగులో రావడంతో పరీక్షకు హాజరు కావలసిన 54 మంది విద్యార్థులు ఏడాది కాలంగా ఇంగ్లిష్ లో కోచింగ్ తీసుకుంటున్నారన్నారు. వచ్చేనెల డిసెంబర్ 8వ తేదీన నిర్వహించే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఇంగ్లిష్‌లో రావాల్సిన హాల్ టికెట్లు ఒక్క విద్యార్థికి ఇవ్వగా మిగిలిన 53 మంది విద్యార్థులకు తెలుగులో హాల్ టికెట్లు వచ్చాయన్నారు. దీంతో తాము ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించగా పొరపాటు జరిగిందని ఆయన తెలిపారన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్నామన్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు రామారావును వివరణ కోరగా ఈ సమస్యను డివిజనల్ ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. తొందరలోనే సమస్య పరిష్కారం కానున్నదని ఆయన తెలిపారు. ఈ ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు దొంగ ప్రసాద్, కపురు ముత్యాలరావు, కడలి యోగానంద, కాండ్రేకుల సత్యనారాయణ, స్కూల్ ఛైర్మన్ కొల్లాటి చూడాలని ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పిహెచ్‌సిల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కాళ్ల

వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాల్సిందేనని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి, వైద్య ఆరోగ్య మండల ప్రత్యేక అధికారి పి.శ్యామ్ సుందర్ ఆదేశించారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వ్యాక్సిన్ నిల్వలు, పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిధిలో గర్భిణుల వివరాల నమోదు, ఒపి తదితర విషయాలను సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి పి.శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు సిబ్బంది కూడా తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసిబ్బంది దీర్ఘకాలిక పేషంట్లకు పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేయాలని, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి తీసుకోవాల్సిన పలు విషయాలపై సూచనలు, సలహాలు చేశారు. వైద్యాధికారి సరాబు సునీల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాలకొల్లు తహశీల్దార్ వై.దుర్గా కిషోర్ లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది అందరూ సమయానికి వస్తున్నారా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. డెలివరీ రూమ్, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, టిబి ల్యాబ్ రూమ్, ఫార్మసీ విభాగాలను పరిశీలించారు. డాక్టర్ ప్రతాప్ కుమార్ పిహెచ్‌సిలో అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని కుక్క కాటుకి, పాము కాటుకి వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, ల్యాబ్‌లో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. పిహెచ్‌సికి ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయమని డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్‌ని తహశీల్దార్ అడుగగా వార్డులోకి ఐదు బెడ్లు అవసరమని, డెలివరీ రూమ్‌లో కొన్ని పరికరాలు అవసరమని తెలిపారు. పిహెచ్‌సి వెనుక భాగంలో ఎక్కువ ఖాళీ స్థలం ఉండటం వల్ల మొక్కలు పెరిగి ఇబ్బందికరంగా ఉందని, పాములు వస్తున్నాయని తెలియజేశారు. వాటికి తహశీల్దార్ త్వరలో శుభ్రం చేయిస్తామని అన్నారు. డాక్టర్ ఎం.నవ్య జీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఫార్మాసిస్ట్ పివి.స్వామి, సూపర్వైజర్ ఎస్‌కె.అమలేశ్వరరావు, డి.కమల పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు దుప్పట్లు, కంచాలు అందజేత

భీమవరం టౌన్ : వికలాంగులు, అంధులు, బదిరులతో కార్తీక వనసమారాధన నిర్వహించడం భగవంతుడు మెచ్చే కార్యక్రమమని, సమారాధనలు సమైక్య భావాలు పెంపొందిస్తాయని భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం మార్కెట్ యార్డులో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వికలాంగులు, బదిరులు, అంధులు, మానసిక వికలాంగులతో కార్తీక అన్న సమారాధన నిర్వహించి, వారికి దుప్పట్లు, కంచాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అభాగ్యులు, వికలాంగులు దేనిలోనూ తీసిపోరని ఇక్కడ నిర్వహించినటువంటి పోటీలలో నిరూపించారని, గత 30 ఏళ్లుగా వీరందరితో ఇలాంటి సమారాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్న సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజులు అభినందనీయులని అభినందించారు. ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఛైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, యూత్ హాస్టల్స్ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ చిలుకూరి నరసింహారాజు మాట్లాడుతూ వన సమారాధనతో వికలాంగుల్లో చైతన్య స్ఫూర్తి కలుగుతుందని, ఈ బాలలతో విద్యాలయాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంటేటి వెంకటరాజులు మాట్లాడుతూ అరుణోదయ మనోవికాస కేంద్రం, వెంకటేశ్వర బదిరుల పాఠశాల, రమణరాజు అంధ పాఠశాల, ఇమ్మానుయేల్ చిల్డ్రన్స్ హోమ్, ప్రభుత్వ భవిత కేంద్రంలోని 400 మందికి భోజనాలు, దుప్పట్లు, కంచాలు, దాతలు చిలుకూరి నరసింహారాజు, గంధం శ్రీదేవి, సామంతపూడి మణిల ఆర్థిక సహకారంతో అందించామని తెలిపారు. అనంతరం విద్యాసంస్థల ప్రిన్సిపల్ నిర్వాహకులను, మున్సిపల్ కమిషనర్‌ను సత్కరించారు.

ఫ్రైడే డ్రైడే పాటిద్దాం

మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం పట్టణ యాగర్లపల్లి(25వ వార్డు) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఫ్రై డే డ్రై డే కార్యక్రమాలను ఆయన పరిశీలించి, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటినిల్వలు లేకుండా చేసుకొని వారానికొకసారి ఫ్రై డే డ్రై డే పాటించినట్లయితే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. వార్డు ఆరోగ్య కార్యకర్తలు ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త కనకదుర్గ, నేతల కుమారి, పాల్గొన్నారు.

ఉండి: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ శుక్రవారం దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని విస్తృతం చేసినట్లు ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డాక్టర్ బి.సాయి చంద్ర, డాక్టర్ బిన్నీ శామ్యూల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో దోమలు విజృంభించడంతో వైరల్ జ్వరాల వ్యాప్తి అధికమవుతుందని, ప్రతి ఒక్కరూ దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తమ వంతు సహకారం అందించాలని అన్నారు. ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

ఆకివీడు : మండలంలోని సిద్దాపురం ప్రాంతంలో సార్వాకు 140 రోజుల కాలపరిమితి నిడివిగల మధ్యస్థ సన్నగింజరకం సరిపోతుందని మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. శుక్రవారం మండలంలోని సిద్దాపురంలో రైతు మురళీ కృష్ణంరాజు పంట భూమిలో పండించిన వరి రకాలను శాస్త్రవేత్తలు వై.సునీత, డి.రోజ, డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రవితేజ, డాక్టర్ రజిత, స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంటియు 1310, ఎంటియు 1075, సిఆర్ 3598-1-4-2-1 సంకరణం చేసిన రకం 140 రోజుల పంట అని వివరించారు. ఈ రకం గింజ రాలిక తక్కువగా ఉంటుందని, అగ్గి తెగులును బాగా తట్టుకుంటుందని వారు తెలిపారు. ఈ లక్షణాల వల్ల ఈ ప్రాంతంలో ఈ రకం అనుకూలమవుతుందన్నారు. కెవికె ఉండి ఎంటియు 1426, ఆర్ఎన్ఆర్ 15 0 48, చెక్‌మినీ కిట్స్‌ను రైతులు అందజేశారు. ఉండి కెవికె శాస్త్రవేత్త మల్లికార్జునరావు, స్థానిక సహాయ సంచాలకులు కెఎఎస్ఎస్.శ్రీనివాసరావు, ఎ.ప్రియాంక పాల్గొన్నారు.

పోడూరు : మండలంలోని జిన్నూరు, మట్టపర్రు, కవిటం, పోడూరు గ్రామాలలో వ్యవసాయ సహకార సంచాలకులు అడ్డాల పార్వతి పర్యటించి రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. తుపాను కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని, కళ్లాల్లోని ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా వెంటనే మిల్లులకు తరలించాలని, ధాన్యం తడిసిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకుని, వరి కోతలను వాయిదా వేసుకోవాలని రైతులను కోరారు. మండల వ్యవసాయ అధికారి జి.సత్యనారాయణ, అగ్రికల్చర్ అసిస్టెంట్స్ సూర్యకిరణ్, నరసింహమూర్తి, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయవాదిని అందిస్తాం

నాల్గవ అదనపు జిల్లా జడ్జి సత్యవతి

తణుకు : న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని వారికి ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తణుకు ఛైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. శుక్రవారం తణుకు సబ్‌జైల్‌ని జిల్లా జడ్జి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ముద్దాయిలకు అందుతున్న ఆహార, వసతి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిసెంబరు 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, న్యాయవాదులు జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలని తెలిపారు. న్యాయవాదులు టి.సత్యనారాయణరాజు, ఎ.అజయకుమార్, సూపరింటిండెంట్ మోహనరావు పాల్గొన్నారు.

400 మందికి వైద్య పరీక్షలు

వైద్యునికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్యదర్శి మోహన్

నరసాపురం: మండలంలోని సరిపల్లి గ్రామంలో శుక్రవారం మైలాబత్తుల ఉమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును సర్పంచి ఈదా సురేష్ ప్రారంభించారు. ఈ శిబిరానికి గ్రామానికి చెందిన 400 మంది రోగులు కంటి, దంత పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగపర్చుకోవాలన్నారు. వైద్యులు వై.అమ్యుల్ లాల్, కె.రాంబాబు, వర్ధనపు యామిని, శివరాం, గమిడి రత్నరాజు, ఎంవైవి.రమణ, ఏసురత్నం, కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

తప్పులతడకగా ఓటరు జాబితా

ఉండి : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఉండి మండల తహశీల్దార్ కార్యాలయంలో ప్రచురించిన ఓటరు జాబితా తప్పులతడకగా తయారైంది. జాబితాలో ఎక్కువమందికి రెండు, మూడు ఓట్లు దర్శనం ఇవ్వడంతో చాలామంది ఓటర్లు అవాక్కయ్యారు. ఓటరు నమోదు, విచారణలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన సిబ్బంది అలసత్వం దీనికి కారణమని పలువురు చెప్పడం గమనార్హం. దీనికి సంబంధించి మండల తహశీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓటర్లు ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ నమోదు చేసుకోవడంతో ఇటువంటి తప్పులు జరిగాయని, వెంటనే వీటిని సరిచేస్తామని అన్నారు.

కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల గ్రామంలో వేంచేసియున్న సోమేశ్వర స్వామివారి దేవస్థానంలో కార్తీకమాసం పురస్కరించుకొని అఖండ అన్న సమారాధన నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు వివిధ రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించి, అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి యాత్రికులు హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్త్రీ, పురుషులకు వేరువేరుగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, యాత్రికులు, దాతల సహాయ సహకారాలతో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో మందలపర్తి చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షులు గుండాబత్తుల నాగేశ్వరరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు పెంటపాటి వెంకట నాగేశ్వరరావు, బండారు వేణుగోపాలరావు, పుప్పాల బుజ్జి, సుంకర కాశీ విశ్వేశ్వరరావు, ఆరేటి దిలీప్, అంకెం సీతారాం, ఇఒ వేగేశ్న ఆంజనేయరాజు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



వన సమారాధనలో యాత్రికులు

బాలికల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - మొగల్తూరు

బాలికల సంక్షేమం, రక్షణకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన పెంపొందించాలని సిడిపిఒ బి.ఊర్మిళ సూచించారు. శుక్రవారం సాయంత్రం మొగల్తూరు లోని ఐసిడిఎస్ కార్యాలయంలో ట్రెయినింగ్ ఆఫ్ ట్రైనర్స్(టిఒటి)లకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణా తరగతుల్లో మాట్లాడారు. కిశోర బాలికలకు విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, ఫోక్సో యాక్ట్, బాల్యవివాహాలు, ఆత్మ రక్షణ, యోగా తదితర వాటిపై అవగాహన కల్పించవలసిన బాధ్యత పిఒటిలపై ఉందని ఆమె అన్నారు. 11 నుంచి 18 సంవత్సరాల బాలికలను గుర్తించి అవగాహన కల్పించాలని తెలిపారు. బడికి వెళ్లని పిల్లలను గుర్తించి పాఠశాలకు వెళ్లే అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ సుధారాణి, అంగన్వాడీ సూపర్వైజర్లు పద్మావతి, శ్రీదేవి, విజయలక్ష్మి, విజయ కుమారి, అంగన్వాడీ టీచర్లు ఉన్నారు.

పెనుమంట్ర : కిశోర ప్రాయంలో ఉన్న బాలబాలికల వికాశం కోసం పనిచేయడం వల్ల యువతకు ఉజ్వల భవిత ఏర్పడుతుందని ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ మందిరంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జరిగిన కిశోర వికాశం గ్రామస్థాయి శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని శిక్షణను ప్రారంభించారు. కిశోర ప్రాయాన్ని సంరక్షణ చేయడం, మనో వికాశం కలిగించడం అందరి బాధ్యతని ప్రాజెక్ట్ అధికారిణి అంగర కృష్ణకుమారి అన్నారు. ఎపిఎం పి.పద్మ, కాలేజీ లెక్చరర్ బి.సుబ్రహ్మణ్యం, డిసిపియు లీగల్ ఆఫీసర్ కె.విజయ, హెల్త్ విసిటర్ యు.వెంకటరమణ పాల్గొన్నారు.

ఆచంట : బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని పెనుమంట్ర సిడిపిఒ ఎ.కృష్ణకుమారి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ పూర్ణ బాబ్జి అధ్యక్షతన కిశోర వికాసం వన్ ట్రైనింగ్ వన్ ప్రోగ్రాంపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం కల్పించడంతోపాటు వాటి నిరోధానికి గట్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంఇఒ-2, పి.రాజేంద్రప్రసాద్, ఎఎన్ఎం పాల్గొన్నారు.

యలమంచిలి : కిశోర వికాసంపై శిక్షణలో భాగంగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బాలికలను రక్షించండి, బాలికలను చదివించండి అనే నినాదంపై అవగాహనా కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఇందిర మాట్లాడుతూ కిశోర వికాశం కార్యక్రమంలో భాగంగా బాలికల ఆరోగ్య రక్షణ, తీసుకోవాల్సిన ఆహారం గురించి ప్రతి గ్రామంలోనూ విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయ ఎఒ బి.శ్రీనివాస్, ఎంఇఒ కె.వెంకటకృష్ణంరాజు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆక్వా ఫుడ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల ఉమ్మడి ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. కలెక్టర్ సిహెచ్.నాగరాణి ఆదేశాల మేరకు స్థానిక ఆనంద ఇన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జిల్లా సీ ఫుడ్ ప్రాసెసింగ్ ఓనర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆక్వా ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీ యాజమాన్యులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ సీ ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌లో జరిగే ప్రమాదాల పట్ల తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కె.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ భీమవరం ఆనంద గ్రూప్ ఎండి యు.జోగి ఆనంద వర్మ, వెల్కమ్ ఫిషరీస్ ఆనంద్ జె.మహినాథ్ జయలక్ష్మి, సీ ఫుడ్స్ ప్రతాప్ హెచ్‌ఆర్ కన్సల్టెన్సీ ఆలీబాషాలు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ట్రైనర్‌గా ఇండస్ట్రీ సేఫ్టీ ఎక్స్‌పోర్ట్ డి.ఎ.నరసింహ రాజు, ఇంజనీరింగ్ అసోసియేట్ మాట్లాడుతూ సీ ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్స్‌లో ఉపయోగించు అమ్మోనియా గ్యాస్ వల్ల సంభవించు ప్రమాదాలు, వాటి నివారణకు సంబంధించిన చర్యలపై అవగాహన కల్పించారు. ట్రైనింగ్‌కు హాజరైన వారి సందేశాలను నివృతి చేశారు. అనంతరం గోదావరి మెగా ఫుడ్ పార్క్‌లో టెక్నికల్, సేఫ్టీ టీమ్‌చే మోక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మోక్ డ్రిల్ జిల్లాలో ఉన్న సీ ఫుడ్స్ ప్లాంట్స్ నుంచి టెక్నికల్ ఎన్‌డి సేఫ్టీ టీమ్స్ వారు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి : ఆర్‌డిఒ

నరసాపురం: విద్యార్థులు చదువుతో పాటు పరిశోధనలపై కూడా శ్రద్ధ చూపాలని ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సైన్సు ఫెయిర్‌లో ఉమ్మడి పశ్చిమ కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 27 ప్రభుత్వ, ప్రయివేట్ స్కూల్ విద్యార్థులకు చెందిన 1800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 73 పరిశోధన ప్రాజెక్టులను ప్రదర్శించారు. కళాశాలకు చెందిన పాలిటెక్నిల్ విద్యార్థులు 80 పరిశోధనా అంశాలు కూడా ఆసక్తికరంగా కనిపించింది. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఇటువంటి సైన్స్ ఫెయిర్‌లు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో పరిశోధనల పట్ల ఆసక్తి, పోటీ పెరుగుతుందన్నారు. మహాత్మా జ్యోతి బాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు) విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అనంతరం విద్యార్థులకు నగదు పురస్కారం, సర్టిఫికేట్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ ఆడాల శ్రీహరి, ప్రిన్సిపల్ కిరణ్మయి, సురేష్ కుమార్, గోపిచంద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేసిన యాజమాన్యం

మిల్లర్లు త్వరితగతిన ధాన్యం దింపుకోవాలి : జెసి

వీరవాసరం : వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున రైస్ మిల్లర్లు ధాన్యాన్ని త్వరితగతిన అన్లోడ్ చేయడానికి సహకారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు. వీరవాసరంలో నాగజ్యోతి, దయానిధి రైసు మిల్లులు, పంజా వేమవరంలో తులసి రైసు మిల్లును శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లులకు వచ్చిన ధాన్యమును వెంటనే అన్లోడ్ చేసే విధంగా మిల్లర్లు సహకరించాలని అన్నారు. అవసరాన్ని బట్టి హమాలీలను అందుబాటులో ఉంచుకుని వాహనాలు అన్లోడ్ చేయించిన వెంటనే పంపివేయాలని కస్టోడియన్ అధికారులను ఆదేశించారు. ఆరబెట్టిన ధాన్యములను మిల్లులకు తరలించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జెసి వెంట ఎడి బిన్నీ బాబు, ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలి

వ్యవసాయాధికారికి సిపిఎం నాయకుల వినతి

తణుకు : తుపాన్ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుని ఆదుకోవాలని ఇరగవరం సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రైతులను ఆదుకోవాలని రైతు, కౌలు సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్యాలయం వద్ద అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ పంటలు రైతులకు చేతికి అందే సమయంలో తుపాను ప్రభావం వచ్చిందన్నారు. దీనివల్ల రైతులందరూ ఆందోళన చెందుతున్నారని మునిస్వామి తెలిపారు. రైతులు కోత కోసే సమయంలో నష్టం జరుగకుండా చూడాలని, ధాన్యం పట్టుకొనేందుకు సంచులను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, ధాన్యానికి గిట్టుబాటు ధరను ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌలు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిపి అందే సూర్యావతి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, జెడ్‌పిటిసి సభ్యులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని అన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం సత్యవరం గ్రామానికి చెందిన పీతల మణి కుమారి ఒరిజినల్ పాస్ పోర్ట్ **నెం. V547558** తీసుకుని సత్యవరం నుండి పెనుగొండ మోటర్ సైకిల్ పై వెళ్ళుతుండగా మార్గం మధ్యలో పడిపోయింది దొరికిన వారు క్రింది అడ్రస్కు అందజేయగలరు.

అడ్రస్ **పీతల మణికుమారి**
భర్త సత్యనారాయణ,డోర్ నెం. 3-95A
సత్యవరం గ్రామం పెనుమంట్ర
మండలం పశ్చిమగోదావరి జిల్లా
సెల్ నెం. 9490179919

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు పశ్చిమ గోదావరి జిల్లా, ఉండి మండలం, ఉండి కాపురస్తులు తాడేపల్లి రాజేంద్ర ప్రసాదరావు గారి కుమారుడు శ్రీరామచంద్రమూర్తి గారు వారి పేరున గల అనగా వారు ది.04.06.2015వ తేదీ ద.నెం.3769/2015రు దస్తావేజులోని ఆస్తికి లింకు దస్తావేజైన అనగా నా క్లయింటు క్రయదారైన ఇమ్మళరాజు నాగేశ్వర వర్మ గారి పేరున గల ది.**15.11.2012**వ తేదీ భీమవరం స.రి.కా.ద.నెం. 6925/2012రు క్రయ దస్తావేజును లోగడ వారు జిరాక్సు నిమిత్తం ఉండి సెంటరుకు వెళ్ళుక్రమంలో పోగొట్టుకున్నారని మరియు వారు సదరు దస్తావేజు ఎంతవెతికిననూ దొరికియుండలేదనిన్నీ తెలిపియున్నారు. కావున సదరు దస్తావేజు ద.నెం.6925/2012 (భీమవరం స.రి.కా) రు పోవుటపై ఎవ్వరికైననూ ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేదీ నుండి 3 రోజుల లోపుగా ఈ క్రింది అడ్రస్సునకు తెలియపర్చవలెను. లేనిఎడల సదరు నా క్లయింటు ఆస్తి నిష్పేచ్చి ఆస్తిగా పరిగణించుదుము.

భీమవరం, **రేలంగి హరి నాగవెంకట సత్యనారాయణ**
తేది.29.11.2024 అడ్వకేట్, భీమవరం.
సెల్: 9052057507

NOTICE
BEFORE THE COURT OF JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT BANTUMILLI
M.C. NO. 1/2022

Between :
పొన్నాల లక్ష్మీదుర్గ మరియు 2 ఇతరులు... పిటీషనర్స్
వర్సెస్
పొన్నాల చంద్రరాజు .... రెస్పాండెంట్టు,
పొన్నాల చంద్రరాజు, తండ్రి : పల్లవరాజు, ప్రైవేట్ ఉద్యోగి, తోకతిప్ప గ్రామం, భీమవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు మనోవర్తి కేసు పైన పేర్కొన్న కోర్టు ఎదుట పెండింగ్‌లో వున్నది. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. పై కోర్టు వారి ఎదుట ది. 18-12-2024వ తేదీన తమరి హాజరు నిమిత్తం వాయిదా వున్నది. కావున సదరు తేదీ నాడు సదరు కోర్టువారి ఎదుట మీరు ప్రత్యక్షంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరు కావలయును. అట్లు కాని పక్షంలో మీకు సదరు కేసుకు సంబంధించి పరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయటమైనది.
(శ్రీ కోర్టువారి అనుమతితో)
వాయిదాతేది : 18-12-2024
బంటుమిల్లి.
తేది: 28-11-2024
ఇ.వి.ఎస్.రాయుడు,
పిటీషనర్స్ తరఫు న్యాయవాది.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT NUZIVID
EP No. 60/2016 in
ABR/CF/No. 172/2014
Margadarsi Chit Fund (P) Ltd.,
Santhosh Nagar Branch, Hyderabad
..... D.H.R.
AND
Mr. T.V.R. Vara Prasad, S/o Krishna Rao, aged 56 years, R/o H.No. 1-8-22/1, Flat No. G-2, Sarathi Apartments, North Kamala Nagar, ECIL (P), R.R. Dist.
(Property situated at Nuzivid, Eluru dist)
.... 1st J.D.R.

పై నెంబరు అమలులో 1వ జెడిఆర్ తాలూకు ఈ క్రింది తెలిపిన ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది. 20-12-2024వ తేదీన పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గం.లకు బహిరంగ వేలము జరుగునని తెలియపరచటమైనది. కావున వేలంపాటలో పాల్గొనువారు వేలంపాటలో పాల్గొనవచ్చును.
1st JDR Schedule : Krishna District, Nuzivid Sub Register Office వారి యిలాకా Nuzivid Municipality ఏరియాలోని, Nuzivid Mandal, Nuzivid Villageలో Agriculture Land Admeasuring Ac 0-23, 3/4 Cts Or 0.97 Hectors in Survey No. 1005/1, Nuzivid ఏరియాలో గల ఖాళీగా వున్న స్థలమునకు హద్దులు :
North : Badugu Rambabu &
E. Rajashekar Land
South : Donka, West : donka
East:Guttikonda Hari Krishna Prasad Land.
Note : Krishna district, Now present Eluru District)
D.H.R. Value : Rs. 4,00,000/-
Ameen Value : Rs. 7,00,000/-
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వేలం వాయిదా : 20-12-2024
ఫరదర్ హియరింగ్ : 27-12-2024
ఇట్లు
ఎం.రమేష్,
అడ్వకేట్, నూజివీడు.